క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర దేవాలయంలో ఆదివారం వీరాంజనేయ స్వామి జయంతిని ఘనంగా జరిపారు. వరాహస్వామి ఆలయ ఆవరణలో వెలసిన స్వామి వారికి అర్చకులు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. విశేష అలంకరణ, అర్చన, మంగళహారతులు పట్టారు. వడ ప్రసాదం నైవేద్యాన్ని స్వామివారికి సమర్పించి భక్తులకు పంచి పెట్టారు.

అడుగడుగునా గుంతలే



రాళ్ల చిట్టంపల్లి రోడ్డు దుస్థితి

వికారాబాద్ అర్బన్: రాళ్లచిట్టంపల్లి, పీలారం, మైలార్ దేవరం పల్లి గ్రామాలకు వెళ్లే ఆర్అండ్బీ రోడ్డు అధ్వానంగా మారింది. బురంతపల్లి తండా నుంచి రాళ్ల చిట్టంపల్లి వరకు గుంతలు ఏర్పడి.. ద్విచక్ర వాహనదారులకు చుక్కలు చూపెడుతోంది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం నరకం అంటూ పలువురు వాపోతున్నారు. ఇలా గోతుల మయంగా మారిన రహదారిని బాగు చేయించాలంటూ ఆర్అండ్బీ అధికారులు, ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదని పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

దాహం తీర్చే దాతలు



ఆలంపల్లి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రం

వికారాబాద్ అర్బన్: ఎండలు మండి పోతున్నాయి. రోడ్డు మీదకు రాగానే ఎక్కడైనా తాగడానికి చల్లని నీరు దొరికితే బాగుండు అనుకునే వారే ఎక్కువ. పైగా పెళ్లిల్ల సీజన్. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రజలు దాహం తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి బాటసారులకు చలివేంద్రాలు దాహం తీరుస్తూ ఎండ నుంచి ఉపశమనం ఇస్తున్నాయి. వికారాబాద్ పట్టణంలో సుమారు పది చలివేంద్రాలు ఉన్నాయి. గతంలో మట్టి కుండలు పెట్టి, సాధారణ నీటితో చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు ఎక్కువగా నల్లాలు ఉన్న ఫ్రిజ్‌లను ఏర్పాటు చేసి చల్లటి మినరల్ వాటర్ అందజేస్తూ.. బాటసారుల దాహం తీరుస్తున్నారు.

హెల్మెట్ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గిరి

కుల్కచర్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కుల్కచర్ల ఎస్‌ఐ గిరి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనదారులకు హెల్మెట్ వాడకంపై ఆయన అవగాహన కల్పించారు. హెల్మెట్ పెట్టుకొని సురక్షిత ప్రయాణం చేయాలని, వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

సీఎం కప్ టోర్నీలో భాగస్వాములు కండి

దోమ: ఈ నెల 15, 16, 17వ తేదీల్లో జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించే సీఎం కప్ టోర్నీలో యువతీయువకులు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ జయరాం ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఉంటాయని, 15 నుంచి 35 సంవత్సరాల వయసు గల యువత అర్హులన్నారు. ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే ఈ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలని సూచించారు. సత్తా చాటిన వారిని జిల్లా స్థాయి టోర్నీకి ఎంపిక చేస్తామని, అక్కడ గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తమన్నారు. ఈ టోర్నీ విజేతలకు ప్రభుత్వం ప్రశంసా పత్రాన్ని అందజేస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రకటించారు.

పచ్చదనంపై గొడ్డలి వేటు!

- వగలు నరకటం.. రాత్రి తరలించటం
- యథేచ్ఛగా కలప దందా
- చోద్యం చూస్తున్న అధికారులు

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, పర్యావరణాన్ని కాపాడండి అంటూ ప్రభుత్వం విస్తృత ప్రచారం చేస్తోంది. హరితహారం పేరిట కోట్ల రూపాయలు వెచ్చిస్తూ పచ్చదనం పెంచుతోంది. కానీ.. కొందరు అధికారుల నిర్లక్ష్యంతో కలప దొంగల గొడ్డలి వేటుకు సర్కారు శ్రమ.. వృథా అవుతోంది.

పెద్దేముల్: ఓ వైపు ప్రభుత్వం పర్యావరణానికి పాటుపడుతూ అడవుల విస్తీర్ణతతో పాటు, ఖాళీ జాగలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటుతూ నిత్యం పర్యవేక్షిస్తోంది. ఇదంతా నాణేనికి ఒకవైపు కాగా.. మరోవైపు అటవీ, రెవెన్యూ అధికారులు కలప దొంగలకు కాపాలా కాస్తూ పచ్చదనం దోపిడీకి ప్రత్యక్షంగా సహకరిస్తున్నారే ఆరోపణలు లేకపోలేదు. సుద్ద పరిశ్రమలు, ఇటుక బట్టీలు అధికం కావడంతో మండలంలో కలపకు డిమాండ్ ఏర్పడింది. ఎటువంటి అనుమతులు లేకుండా అడవులను నరికి తాండూరు, పెద్దేముల్ ప్రాంతంలోని కట్టెకోత మిషన్‌లకు తరలిస్తున్నారు.

లక్ష్యం నిర్లక్ష్యం..

అటవీ శాతాన్ని రెట్టింపు చేసి, పర్యావరణాన్ని కాపాడాలనే లక్ష్యంతో ఏటేటా ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తూ హరితహారం కార్యక్రమం నిర్వహిస్తుండగా.. అధికారుల పనితీరుతో అది నిర్లక్ష్యానికి గురవుతోంది. నాటుతున్న మొక్కల్లో 50శాతం కూడా కానరావటం లేదని, కానీ లెక్కల్లో మాత్రం పక్కాగా చూపెడుతుండడం గమనార్హం. మొక్కలు మానుగా ఎదగక ముందే కలప దొంగల గొడ్డలి వేటుకు గురవుతున్నాయి. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.



పొలం గట్టుపై నరికి వేసిన చెట్లు (ఫైల్)

అధికారుల హడావుడి

మంబాపూర్, కందనెల్లి, తట్టెపల్లి, అడ్కిచెర్ల, నాగులపల్లి, పెద్దేముల్ మారేపల్లి ప్రాంతాల్లో చెట్ల నరికివేత యథేచ్ఛగా కొనసాగుతోంది. పగలు నరకడం రాత్రి వాహనాల్లో మారేపల్లి, కోటపల్లి మండల ఓగ్లాపూర్ గ్రామ శివారుల్లో ఉన్న సుద్ద పరిశ్రమలకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. కలప రవాణాపై పత్రికల్లో వచ్చినప్పుడు మాత్రమే రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు హడావుడి చేయడం, జరిమానా విధించడం తప్పితే.. కలప దోపిడీకి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఎక్కడైనా చెట్ల నరికివేతకు పాల్పడుతున్న వారిని స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే.. అధికారులతో మాట్లాడామనే సమదానం చెబుతూ తమపని కానిచ్చేస్తున్నారు. ఇదే విషయమై తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డిని వివరణ కోరగా.. వారు అందుబాటులోకి రాలేదు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డిని అడగగా.. చట్ట ప్రకారం అనుమతి



ట్రాక్టర్లలో కలప తరలింపు

ఉంటే చెట్లు నరకాలని, పర్మిషన్ లేకుండా నరకితే చర్యలు తప్పవని తెలిపారు.

వాల్టా చట్టానికి తూట్లు

వాల్టా చట్టం ప్రకారం కలప, ఇసుక తరలింపును అధికారులు అడ్డుకోవాలి. చెట్ల నరికి వేత, కలప తరలింపు నిరోధానికి చర్యలు తీసుకోవాలి. కానీ అవేమీ చేపట్టడం లేదు. రైతులు పట్టా భూముల్లో చెట్లను నరికి వేయాలని అనుకుంటే.. మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఆ తరువాత స్థలాన్ని పరిశీలించిన అనంతరం తహసీల్దార్ అనుమతి ఇస్తేనే చెట్లను కొట్టుకోవలసి ఉంటుంది. కానీ మండల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండానే చెట్లను నరికి వేస్తూ.. వ్యాపారులు సొమ్ముచేసుకుంటున్నారు.

చెట్లను కాపాడాలి



మహావృక్షాలను కాపాడుకుంటూ.. కొత్తగా నాటే మొక్కలను కాపాడాలి. వాటిని సంరక్షించి పెంచి పెద్దచేయాలి. ఇది ప్రతి ఒక్కరి బాధ్యత. రైతులకు అవగాహన లేకపోవడంతో దళారులు, వ్యాపారుల మాటలు విని చెట్లను నరికి వేస్తున్నారు. చెట్ల ప్రాముఖ్యతపై అవగాహన చేపట్టాలి.

– రాంచెంద్రయ్య మాజీ సర్పంచ్ బండమీదిపల్లి

కఠిన చర్యలు చేపట్టాలి



మండలంలో సుద్ద, ఇటుక బట్టీలు అధికంగా ఉన్నాయి. అందుకే కలపకు డిమాండ్ ఏర్పడింది. ఇదే అదనుగా భావించిన కలప వ్యాపారులు కొందరు భారీ చెట్లను నరికి సొమ్ముచేసుకుంటున్నారు. రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు వాల్టా చట్టం ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– నసీర్ మండల కోఆప్షన్ సభ్యుడు, గాజీపూర్

ఆలయ అభివృద్ధికి విరాళం

పూడూరు: ఎన్కేపల్లి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ, దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన, బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సహాయంగా రూ.75 వేల నగదును విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. సర్పంచ్ వనజ, ఎంపీటీసీ సురేందర్, నాయకులు రాములు, గంగాధర్‌గౌడ్, సీతారాములు, బాలమణి, శ్రీశైలంగౌడ్, రాజు, బందయ్య పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో మాజీ మంత్రి

మర్పల్లి: ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకలకు మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గ సోషల్ మీడియా కన్వీనర్ రఘుపతి రెడ్డి, మర్పల్లి మాజీ సర్పంచ్ పాండునాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు, గణేశ్, మల్లేశ్‌యాదవ్, గోపాల్ ఉన్నారు.

బీజేపీని గద్దె దించాలి

దౌల్తాబాద్: రానున్న ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ నియోజకవర్గ సీనియర్ నాయకుడు బషీర్ అన్నారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో బీజేపీ హఠావో.. దేశ్‌కి బచావో అంటూ చేపట్టిన ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎన్నడూలేని విధంగా గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలను కేంద్రం పెంచిందని, వ్యవసాయ రంగంపై సబ్సిడీలను ఎత్తివేసిందని మండిపడ్డారు. కావున రానున్న ఎన్నికల్లో బీజేపీని ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రాజు, ముస్తఫా, సర్పంచ్ వెంకటప్ప పాల్గొన్నారు.

వేలాడుతున్న యమపాశాలు

చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు.. పట్టించుకోని ట్రాన్స్‌కో

ధారూరు: వేసవి దుక్కులు దున్నించేందుకు ఓ రైతు ఆదివారం తన పొలానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో అతనికి తాకేంత ఎత్తులో విద్యుత్ తీగలు తారాసపడటంతో ఒకింత భయాందోళనకు గురయ్యాడు. ఇలా పరిసర ప్రాంతంలో యమపాశాల్లా వేలాడే తీగలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తీగల వలన పశునష్టం, ప్రాణనష్టం జరుగుతున్నా ట్రాన్స్‌కో సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇలా ప్రమాదకరంగా ఉన్న తీగలను సరిచేయాలని, శిథిలావస్థకు చేరిన స్తంభాలను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని 'మీతోనేను' కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆ శాఖ అధికారులకు పలుమార్లు చెప్పారు. అయిన వారు పట్టించుకోవడం లేదని అన్నదాతలు, ప్రజలు వాపోవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేలాడే తీగలను సరిచేయడంతో పాటు.. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అంతారం గ్రామ సమీపంలో పొలాలకు వెళ్లే దారికి అడ్డంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

అంబలితో ఆరోగ్యం పదిలం

కొడంగల్: పేదలు ఎంతో ఇష్టంగా తాగే పానియం అంబలి. ఉదయం పూట తాగితే ఆరోగ్యం మెరుగుపడుతుందని వారి నమ్మకం. ఆ నమ్మకం ఇప్పుడు పట్టణాలకు వ్యాపించింది. ప్రస్తుతం పట్టణాల్లో అంబలి కేంద్రాలు ఎక్కువగా వెలుస్తున్నాయి. వేసవి కాలం కావడం వలన ప్రాధాన్యం సంతరించుకుంది. సమాజంలో నూటికి 70 శాతం మందిని పలు రకాల రుగ్మతలు బాధిస్తున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలు వారి ఆహార అలవాట్లను మార్చుకుంటున్నారు. ఉదయం పూట అంబలి తాగుతున్నారు. మధ్యాహ్నం జొన్న రొట్టె, రాత్రి వేళల్లో తేలిక పాటి ఆహారం తీసుకుంటున్నారు.

రెండు రకాలు..

ఒకటి జొన్న అంబలి, రెండోది రాగి. ఈ రెండు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. జొన్న, రాగుల్లో బీ కాంప్లెక్స్, విటమిన్స్, ఫైబర్, విటమిన్ ఏ, విటమిన్ సీ లాంటి అత్యవసర పోషకాలు అధికంగా ఉన్నాయి. చక్కెర వ్యాధి గ్రస్తులకు ఇది చక్కటి ఆహారం. ఇమ్యునిటీ పెంచడంలో అంబలి ఎంతో ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు. శరీరానికి శక్తి నిచ్చే పదార్థాలతో పాటు రక్త వృద్ధికి తోడ్పడే ఇనుము, కాల్షియం, బీ విటమిన్లు, ఫోలిక్ ఆమ్లం వంటి సూక్ష్మ పోషకాలు జొన్నలు, రాగుల్లో పుష్కలంగా లభిస్తాయి.

రాబోయేది ప్రజా ప్రభుత్వమే

కేశంపేట: రాష్ట్రంలో, దేశంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జాతీయ పార్టీ కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కొందుర్గు మండలంలో నిర్వహిస్తున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పీపుల్స్‌మార్చ్ పాదయాత్రకు మండలం నుంచి కార్యకర్తలు స్వచ్ఛందంగా హాజరయ్యారని అన్నారు.

ఆత్మ విశ్వాసం.. అవుట్!

- ఉపాధ్యాయుల నిర్వాకంతో.. పడిపోయిన పర్సెంటేజ్
- లీకేజీతో ఫలితాలు తారుమారు
- తాండూరులో పరీక్ష రాసింది 3,430 మంది
- 1,096 పాస్.. 2,334 విద్యార్థులు ఫెయిల్

తాండూరు: పది విద్యార్థుల భవిషత్ ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయుల నిర్వాకంతో అంధకారంలోకి నెట్టబడింది. పరీక్షలు ప్రారంభమైన తొలి రోజే ఇన్విజిలేటర్ ప్రశ్న పత్రాన్ని వాట్సాప్ ద్వారా లీక్ చేయడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం కాగా.. పరీక్ష రాసే విద్యార్థులు ఒత్తిడికి లోనయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చే వారిపై లీకేజీ ప్రభావం పడింది. దీంతో ఉత్తీర్ణత శాతం భారీగా పడిపోయింది. గతంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల్లోనూ ఈ సారి ఇద్దరే పాస్ కావడం గమనార్హం. టెన్త్ ఎగ్జామ్ ప్రారంభం రోజునే తాండూరు పట్టణంలోని ప్రభుత్వ నంబర్1 పాఠశాల పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్ బందెప్ప.. వాట్సప్‌లో ప్రశ్నపత్రాన్ని మరో ఉపాధ్యాయుడు సమ్మప్పతో పాటు మరికొందరికి పంపించాడు. అయితే పొరపాటున బందెప్ప గ్రూపులో షేర్ చేయడంతో విషయం వెలుగు చూసింది. తర్వాత అధికారులు విచారణ చేసి నలుగురిపై వేటు వేశారు. వారిపై చర్యల సంగతి ఎలా ఉన్నా.. విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థంగా మారింది. నియోజవకర్గంలో 3,430 మంది పరీక్ష రాయగా.. 1,096 మంది ఉత్తీర్ణత సాధించారు. మిగతా 2,334 మంది ఫెయిల్ అయ్యారు. పేపర్ లీకేజీతో తమ పిల్లలు మనోధైర్యం కోల్పోయి, ఒత్తిడికి లోనయ్యారని, దీంతోనే వారు ఫెయిల్ అయ్యారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.



ప్రభుత్వ నంబర్1 పాఠశాల

నాలుగు మండలాలు.. ఇద్దరు ఎంఈఓలు

మూడేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పనితీరుపై స్థానికంగా అనేక విమర్శలు వస్తున్నాయి. ఉపాధ్యాయ సంఘాల పేరిట పలువురు రాజకీయాలు చేస్తూ కాలం వెల్ల దీస్తుండగా.. మరో వైపు మండల విద్యాధికారులు ఎప్పటికప్పుడు పాఠశాలలను తనిఖీ చేయడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. నాలుగు మండలాల్లో నలుగురు మండల విద్యాధికారులు ఉండాలి. కానీ ఇద్దరే కొనసాగుతున్నారు. ఒక్కొక్కరికి రెండు మండలాలు ఉండటంతో పాఠశాలల సోదాలు, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల సామర్థ్యం గురించి ఆరాతీయాలన్న విషయాన్ని విస్మరించినట్లు స్థానికులు చెబుతున్నారు.

ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ..

పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఈ సారి ఉత్తీర్ణత శాతం భారీగా పడిపోయింది. మరోవైపు 10కి 10 శాతం కనిపించలేదు. గతంలో పరీక్షా కేంద్రాల నుంచి ఇన్విజిలేటర్‌లతో పేపర్లను ముందుగానే సేకరించి తమ విద్యార్థులకు చీటీలను చేరవేసే వారని స్థానికంగా ఆరోపణలు వస్తున్నాయి. అందుకు గత నెలలో ఓ జిరాక్స్ సెంటర్‌లో లభ్యమైన పేపర్లే అందుకు సాక్షంగా నిలిచాయి. కానీ ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

పుస్తె, మెట్టెల అందజేత

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లిలోని నిరుపేద కుటుంబానికి చెందిన గంజాయి చెన్నయ్య కుమారుడు ప్రవీణ్‌కుమార్ వివాహానికి సర్పంచ్ బసిరెడ్డి పద్మ, మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి దంపతులు ఆదివారం పుస్తె, మెట్టెలను అందజేశారు.

సమస్యకు పరిష్కార'మార్గం'

చందా సొమ్ముతో రోడ్డు నిర్మాణం

దౌల్తాబాద్: 'తమ గ్రామానికి రోడ్డు వేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను ఏళ్లతరబడి వేడుకున్నాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇక లాభం లేదని చందాలు వేసుకొని మట్టి రోడ్డును నిర్మించుకుంటున్నాం' అని గ్రామస్తులు చెప్పారు. వివిరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్ మండలం సుల్తాన్‌పూర్‌తండాకు రోడ్డు సౌకర్యం సరిగా లేదు. కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని దుస్థితి. వర్షాకాలం వచ్చిందంటే ఇక ఇబ్బందులు చెప్పనలవి. ప్రజాప్రతినిధులు, అధికారులకు రోడ్డు వేయించాలని పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. దీంతో ఎవరికోసం ఎదురు చూడకుండా.. గ్రామస్తులంతా ఏకమయ్యారు. చందాలు వేసుకుని రూ.3లక్షలు జమచేసి, ఆదివారం పరిష్కార 'మార్గం' నిర్మించుకొని ఆదర్శంగా నిలిచారు.



రోడ్డుకు మట్టి పోసుకుంటున్న తండావాసులు

కంకర రోడ్డు కష్టాలు తీరేదెన్నడో!

రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు ఉన్న రోడ్డును తవ్వేశారు. కొత్తగా పనులు చేపట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. రోడ్డు పనులు ప్రారంభించి ఏడాది గడుస్తున్నా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా మారింది. పనులు ముందుకు సాగక.. రోడ్డు మార్గం సరిగా లేక వాహనదారులకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది.

- ఏడాది గడిచినా పూర్తికాని సీసీరోడ్డు
- నగం పనులతో వాహనదారులు సతమతం
- నిధులు రాక నిలిపేసిన కాంట్రాక్టర్!

కుల్కచర్ల: రోడ్డు విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో ఇంతకు ముందున్న బీటీరోడ్డును తొలగించారు. కొత్తగా 1.2కిలో మీటర్ల దూరం సీసీ నిర్మాణానికి రూ.2కోట్ల 8లక్షలు ప్రభుత్వం నిధులు కేటాయించింది. 2022 మార్చి మొదటి వారంలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. కానీ పనులు ముందుకు సాగడం లేదు. ఏడాది గడిచినా రోడ్డు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఒక వైపే పూర్తి..

1.2కిలో మీటర్ల దూరం రోడ్డు పనులు నిర్వహించాల్సి ఉండగా.. ఇప్పటివరకు ఒక వైపు మాత్రమే పనులు పూర్తిచేశారు. మరోవైపు కంకర వేసి అలాగే వదిలేయడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఒక వేపు నుంచే వాహనాల రాకపోకలు సాగుతుండడంతో నిత్య ట్రాఫిక్‌తో ఇక్కట్లు ఎదురవడంతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక వైపు రోడ్డు వేయడానికి ఏడాదికి పైగా సమయం తీసుకున్నారని, మరోవైపు పూర్తిచేయడానికి ఇంకెంత కాలం పడుతుందోనని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని రోడ్డు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. నిధుల రాకపోవడంతో సదరు నిర్మాణ దారుడు సీసీ పనులు నిలిపివేసినట్లు సమాచారం.



కుల్కచర్లలో ఒక వైపు సీసీ, మరోవైపు కంకర రోడ్డు

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం



రోడ్డు ఒకవైపే పూర్తిచేయడం వలన తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నాం. వచ్చిపోయే రోడ్డు ఒకటే కావడంతో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. కంకర రోడ్డుపై వెళ్లలేని దుస్థితి. అధికారులు స్పందించి రోడ్డు పనుల పూర్తికి చర్యలు చేపట్టాలి.

– బాలకృష్ణ గౌడ్, వాహనదారుడు, కుల్కచర్ల

త్వరలో ప్రారంభిస్తాం

నిధుల విడుదల జాప్యంతో పాటుగా మరో మూడుప్రాంతాల్లో రహదారి పనులు ప్రారంభించాం. అందుకే కొంత ఆలస్యం జరుగుతోంది. త్వరలో నిర్మాణ దారుడితో మాట్లాడి, వీలైనంత తొందరగా.. రోడ్డుపనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– మహేశ్, ఆర్అండ్బీ ఏఈ, కుల్కచర్ల

నిరుపేదలే లేబర్ కార్డుకు అర్హులు

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ లేబర్ కార్డుకు అర్హులేనని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డులను అందజేసి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు తీసుకోవచ్చని చెప్పారు. సహజమరణం సంభవిస్తే రూ.1,30,000, ప్రమాద వశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు బీమా వస్తుందని తెలిపారు. ఇంట్లో ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లకు రూ.30వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సందీప్‌కుమార్, సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు మక్బుల్, సుధాకర్‌గౌడ్, శివ, శ్రీనివాస్, రాంచందర్, కార్మికులు పాల్గొన్నారు.



లేబర్ కార్డులు అందజేస్తున్న నాయకులు

సీఐ నవీన్‌కుమార్‌కు సన్మానం

షాద్‌నగర్: విధి నిర్వహణలో అంకితభావం ప్రదర్శిస్తూ జాతీయస్థాయి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న షాద్‌నగర్ పట్టణ సీఐ నవీన్‌కుమార్‌ను ఆదివారం రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్ ఘనంగా సన్మానించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పోలీసు శాఖ పనితీరు జాతీయ స్థాయిలో అత్యుత్తమంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ ఆకాంక్ష మేరకు శాఖ పని చేస్తుందని, సీఐ నవీన్‌కుమార్ జాతీయ స్థాయిలో పురస్కారం అందుకోవడం హర్షణీయమన్నారు.